# చెరువుల అభివృద్ధితో వరదల సమస్యకు చెక్

## నల్లచెరువు అభివృద్ధితో నగరానికి కొత్త అందం

## చెరువుల పరిరక్షణతో నగర భవిష్యత్ సురక్షితం

## నగర అభివృద్ధిని అడ్డుకోకండి : ప్రతిపక్షాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హితవు

## నల్లచెరువు సుందరీకరణ పనుల ప్రారంభం

**హైదరాబాద్ (మూసాపేట), మార్చి 9, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి ప్రాంతంలోని నల్ల చెరువు సుందరీకరణ పనులు పూర్తికావడంతో సోమవారం ఘనంగా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెరువుకు మేళతాళాల మధ్య గంగహారతి ఇచ్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా వేదికపై రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ మాట్లాడుతూ నల్ల చెరువు పునరుద్ధరణలో భాగంగా భారీగా పేరుకుపోయిన చెత్త, మట్టిని తొలగించి సుమారు 2 లక్షల 50 వేల ఘన మీటర్ల వ్యర్థాలను తొలగించామని తెలిపారు. గతంలో కబ్జాల కారణంగా చెరువు విస్తీర్ణం 13.5 ఎకరాలకు తగ్గిపోయిందని, ఇటీవల చేపట్టిన కబ్జాల తొలగింపు, సుందరీకరణ చర్యలతో ప్రస్తుతం సుమారు 30 ఎకరాలకు పెరిగిందని చెప్పారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన నడక మార్గంలో ఒకసారి చుట్టూ నడిస్తే దాదాపు 3 కిలోమీటర్ల దూరం పూర్తవుతుందని వివరించారు.

స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ నల్ల చెరువు అభివృద్ధి పనులు పూర్తి చేయడంపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బేగంపేట ప్రాంతంలో ఉన్న నాలాల సమస్యలు సహా కొన్ని స్థానిక సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ చెరువు అభివృద్ధి పనులు ప్రారంభించినప్పుడు కొంతమంది తీవ్ర విమర్శలు చేసినప్పటికీ ఇప్పుడు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని చెప్పారు. నగరంలోని చెరువులు, కాలువలను అభివృద్ధి చేయడం ద్వారా భవిష్య త్తులో వరదలు, మునిగిపోయే సమస్య లను తగ్గించి హైదరాబాద్ నగరాన్ని సురక్షి తంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. గతంలో తాను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో వర్షాల సమయంలో నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు పడిన ఇబ్బందులను గుర్తు చేసుకున్నారు. చెరువు అభివృద్ధి పనుల వల్ల ఎవరైనా తమ ఇళ్ల స్థలాలు కోల్పోతే వారికి రెండు పడక గదుల ఇళ్లు కేటాయించే విషయాన్ని అరికెపూడి గాంధీకి తెలియజేసినట్లు తెలిపారు.

పిల్లల కోసం ఆట స్థలాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించడంతో పాటు స్థానిక ప్రజలు కోరుతున్న సౌకర్యాలను పరిశీలించి ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీజనకు ఆదేశించారు. దేశంలోని కొన్ని మహానగరాల్లో కాలుష్యం, వరదల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొంటూ హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితులు రాకుండా చెరువులు, కాలువలను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ముఖ్యంగా మూసి రివర్‌తో పాటు నగరంలోని ప్రధాన చెరువులను సుందరీకరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.



నగర అభివృద్ధి కార్య క్రమాలకు ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టించకుండా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. రోడ్లు, ఫ్లైఓవర్లు, నడక మార్గాలు వంటి మౌలిక సదుపాయాల కోసం ప్రజలు ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చని తెలిపారు. గతంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా తనను గెలిపించిన ప్రజలకు అభివృద్ధి ద్వారా రుణం తీర్చుకుంటానని చెప్పారు. కూకట్‌పల్లి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమం అనంతరం ప్రముఖ గాయని మంగ్లీ పాటలతో వినోద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రావు, స్థానిక కాంగ్రెస్ నాయకుడు బండి రమేష్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన సంక్షేమ డైరెక్టర్‌గా సంతోష్ బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా బి.ఎం సంతోష్ బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సోమవారం సంతోష్ పదవిని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బందితో వారి వారి విధులు, పనులను గూర్చి సమీక్ష చేశారు. రానున్న రోజుల్లో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం చేయాల్సిన కార్యక్రమాలపై విభాగాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇక ఫైళ్లన్నింటినీ ఆన్‌లైన్‌లో ఉంచాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఏజెన్సీ ప్రాంతాల్లోని శివారు గ్రామాల్లోని గిరిజనులకు కూడా చేరేవిధంగా ప్రణాళికలు రచించాలన్నారు. ప్రత్యేకించి గిరిజనుల ఆరోగ్యం, విద్యావకాశాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తేల్చిచెప్పారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన సంతోష్‌కు గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు విట్టా సర్వేశ్వర్‌రెడ్డి, చీఫ్ ఇంజనీర్ బాలు, గిరిజన పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ వి. సముజ్వల, జీసీసీ జీఎం ప్రతాప్ రెడ్డి తదితరులు అభివందనలు తెలిపారు.

# బిటెక్ విద్యార్థిని అదృశ్యం

**ఘట్‌కేసర్, మార్చి 9, ప్రభాతవార్త:** బిటెక్ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని మేఘా కళాశాలలో బిటెక్ సిఎస్ఈ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్.గాయత్రీ (24) ఈనెల 8వ తేదీ ఉదయం 10:50 గంటల నుంచి కనిపించడం లేదు. భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన గాయత్రీ వసతిగృహంలో ఉంటూ చదువుతుండగా తల్లిదండ్రుల సూచన మేరకు వార్డెన్ అనుమతి తీసుకొని హాస్టల్ నుంచి బయటకు వెళ్లింది. రాత్రి వరకు హాస్టల్‌కు తిరిగి రాకపోవడంతో ఆమెకు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో తల్లిదండ్రులతో విచారించగా ఏలాంటి ఆచూకి లభించకపోవడంతో వార్డెన్ సునీత ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తప్పిపోయిన గాయత్రీ హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన సమయంలో ముదురు గులాబి రంగు కుర్తా ధరించి ఉందని ఈమేరకు విద్యార్థిని మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ ఎ.శేఖర్ తెలిపారు.

# ఇరిగేషన్‌శాఖలో ఇన్‌చార్జిల పాలన

## పలు కీలక విభాగాల నిర్వహణ అదనపుబాధ్యతల కింద సీనియర్ ఇంజినీర్లకు..

## ఫలితంగా కీలక నిర్ణయాల్లో జాప్యం

## క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణ వైఫల్యం

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** తెలంగాణలో ఇరిగేషన్‌శాఖలో పలు కీలక విభాగాలు ఇన్‌చార్జి అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. ఉద్యోగ విరమణ పొందిన సీనియర్ ఇంజినీర్ల స్థానాలు వెంటనే భర్తీ కావడం లేదు. ఆయా బాధ్యతలను ఇతర విభాగాల్లో కీలకంగా పనిచేస్తున్న సీఈలకు, లేదంటే ఎస్ఈలకు అదనపు బాధ్యతలుగా ప్రభుత్వం అప్పగిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ఇరిగేషన్ శాఖలో మొత్తం 19 సర్కిల్స్ ఉన్నాయి. వాటిలోని అన్ని విభాగాల్లో కలిపి 23 సీఈ పోస్టులు ఉన్నాయి. నిరుడు ఆగస్టులోనే పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం కొత్తగా ప్రమోషన్ పొందినవారితోపాటు ఇప్పటికే 13 మంది సీఈలు ఉద్యోగ విరమణ పొందారు. వారిలో భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, గజ్వేల్, కరీంనగర్, ఆదిలాబాద్, రామగుండం, జగిత్యాల, హైడ్రాలజీ సీఈలు ఉన్నారు. మార్చి నెలాఖరున మరో ఇద్దరు ఈఎన్సీలు సైతం ఉద్యోగ విరమణ పొందనుండటంతో అనేక చోట్ల ఎస్ఈలు, పలు సర్కిళ్లలో ఈఈ పోస్టులు ఖాళీ అయ్యాయి.

ప్రమోషన్లతో ఆ పోస్టులను భర్తీ చేయాల్సి ఉన్నా ఇన్‌చార్జిలతో నెట్టుకురావడంపై నీటిపారుదలశాఖ ఉద్యోగవర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈఎన్సీ, సీఈ, ఎస్ఈ, ఈఈ పోస్టులు ఖాళీ అయినప్పుడు సీనియార్టీ జాబితాలో ఉన్న ఇంజినీరుకు, సీనియర్ ఇంజినీర్ లేకుంటే ఆ బాధ్యతలను పక్కనే ఉన్న ఇతర సీఈ, ఎస్ఈ, ఈఈలకు అప్పగించడం ఆనవాయితీ. కీలకస్థానాల్లో ఉన్న ఇంజినీర్లు అదనపు బాధ్యతల వల్ల సమావేశాలకు, ప్రధాన కార్యాలయాలకే పరిమితమవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షి ంచేవారే లేకుండా పోయారని ఇంజనీర్లు పెదవి విరుస్తున్నారు. ప్రస్తుతం కాలువల ద్వారా సాగునీరు విడుదల చేస్తున్నప్పటికీ ఎక్కడ ఏమేరకు, ఎప్పుడు, ఎవరు విడుదల చేస్తున్నారో తెలియనిపరిస్థితి నెలకొంది. పదోన్నతులు ద్వారా తాము నిర్వర్తించాల్సిన బాధ్యతలను సీనియర్ ఇంజనీర్లకు అదనంగా కేటాయించడంతో ఉన్నత స్థానాల్లో బాధ్యతలు నిర్వర్తిస్తున్నవారికి దిగువనున్న సీనియర్ ఇంజినీర్లు సహకరించకుండా పరోక్షంగా సహాయ నిరాకరణ పాటిస్తున్నారని పలువురు నీటిపారుదలశాఖ ఇంజనీర్లు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. అదే సమయంలో అదనపు బాధ్యతల వల్ల తీవ్ర పనిభారంతో సతమతమవుతున్నామని, దీంతో ఏ పనిపైనా సరిగా దృష్టి సారించలేకపోతున్నామని ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కమిటీల పేరిట కాలయాపన చేయకుండా వెంటనే ప్రమోషన్లు కల్పించాలని, ఖాళీ అయిన పోస్టుల్లో పూర్తిస్థాయి అధికారులను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.

# సిలిండర్ బుకింగ్‌కు గడువు ఇక 25 రోజులు

**ముంబయి, మార్చి 9:** గ్యాస్ వినియోగదారులకు కంపెనీలు షాక్ ఇచ్చాయి. గ్యాస్ సిలిండర్ బుకింగ్‌లో చిన్న మార్పులు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు ఒక సిలిండర్ తీసుకున్న 15 రోజుల తర్వాతే రెండోది బుక్ చేసుకునే అవకాశం ఉండేది. కానీ, ఇప్పుడు ఆ సమయాన్ని 21 రోజులను మళ్లీ 25 రోజులకు పెంచారు. అంటే.. ఒక సిలిండర్ డెలివరీ అయిన తర్వాత, రెండోది రావాలంటే కనీసం 25 రోజుల గ్యాప్ ఉండాలి. దీని కోసం గ్యాస్ ఏజెన్సీల సాఫ్ట్‌వేర్‌ను కూడా అప్‌డేట్ చేశారు. ఒక సంవత్సరంలో (ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు) ఒక్కో కనెక్షన్‌పై మొత్తం 15 సిలిండర్లు మాత్రమే తీసుకోవచ్చు. ఇందులో 12 సిలిండర్లు సబ్సిడీతో వస్తాయి. మిగిలిన 3 సిలిండర్లకు సబ్సిడీ ఉండదు. బుకింగ్ చేసిన 24 గంటల లోపే సిలిండర్ డెలివరీ చేయాలని కంపెనీలు ఆదేశించాయి. దీనివల్ల వినియోగదారులకు చాలా సౌకర్యంగా ఉంటుంది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదు కస్టమర్లు కంగారు పడాల్సిన అవసరం లేదని అందరికీ సిలిండర్లు అందుతాయని అధికారులు చెప్పారు.

# రెండో వారంలో పిఎం కిసాన్ సమ్మాన్ నిధి

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** పీఎంకిసాన్ పథకం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 22వ విడత పెట్టుబడి సాయం కోసం దేశవ్యాప్తంగా రైతులు ఎదురుచూస్తున్న నేపథ్యంలో మార్చి రెండో వారంలోనే ఈ నిధులు రైతుల ఖాతాల్లో జమకానున్నట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దేశంలో రైతన్నలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు కేంద్రం ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద మూడు విడతల్లో రూ.6వేలను అందిస్తున్న విషయం తెలిసిందే. కిసాన్ సమ్మాన్ నిధుల విడుదలకు కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో రైతులు ఈ కేవైసీ తదితర నిబంధనలు పూర్తి చేయాలని అధికారులు సూచిస్తున్నారు. కేవలం ఈకేవైసీ ఉన్నవారికి మాత్రమే కిసాన్ సమ్మాన్ నిధులు జమకానున్నాయి.

# ఆరోగ్యకర ఆహార ఉత్పత్తిలో మహిళా రైతులది కీలకపాత్ర

## వ్యవసాయ విశ్వవిద్యాలయ విసి అల్దాస్ జానయ్య

## ఘనంగా ముగిసిన రెండు రోజుల మెగా మహిళా రైతు మేళా

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తిలో మహిళా రైతులది కీలక పాత్ర అని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయ విసి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య స్పష్టం చేశారు. బిడ్డకు జన్మనిచ్చి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే విషయంలో మహిళల పాత్ర ఎంత కీలకమో... ఆరోగ్యవంతమైన ఆహారోత్పత్తుల విషయంలోనూ మహిళల పాత్ర అంతే ఉంటుందని స్పష్టం చేశారు. అందుకే పంటల ఉత్పత్తిలో సాధ్యమైనంత వరకు రసాయనాల వాడకం తగ్గించి సేంద్రియ పదార్థాల ద్వారా నాణ్యమైన ఆహారపదర్థాలను ఉత్పత్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయశాఖ, కోరమాండల్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన రెండు రోజుల మెగా మహిళా రైతు మేళా సోమవారం ఘనంగా ముగిసింది. తొలి రోజు 6,000 మంది , రెండో రోజు సుమారు 5,000 మంది మొత్తంగా పదకొండు వేల మంది మహిళా రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ.. రెండు రోజుల కార్యక్రమంలో నేల ఆరోగ్యం, ఆధునిక వ్యవసాయంలో మహిళలపాత్రపై అవగాహన కల్పించామన్నారు. కోటి మంది మహిళలని కోటీశ్వరులని చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్య సాధనలో మహిళా రైతులది చాలా కీలక పాత్ర అని ఆయన స్పష్టం చేశారు.

అధిక రసాయనాలను వివిధ పంటల సాగులో వాడటం వల్ల నేల ఆరోగ్యం, గాలి, నీటి నాణ్యతలు క్షీణిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా రసాయన అవశేషాలతో కూడిన ఆహార పదార్థాల ఉత్పత్తి, వినియోగం వల్ల మానవాలి కొత్త ఆరోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా.. రాష్ట్ర ప్రభుత్వం రైతులు, వ్యవసాయరంగ అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తూ పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తుందని వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర మోహన్ వివరించారు. రాష్ట్రంలో కూరగాయలు, పూలు, ఆయిల్ పామ్ తదితర పంటల సాగు పెరగాలన్నారు.

99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే నెల 4 నుంచి మే 9వరకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు వ్యవసాయం, అనుబంధరంగాలకు సంబంధించిన 12 అంశాలపై అవగాహన కల్పిస్తామని ప్రకటించారు. కాగా.. పంటల మార్పిడి, యాంత్రీకరణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని సిడ్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. నాణ్యమైన విత్తనాలు, అవసరమైన మేరకే ఎరువులు, పురుగుమందులు వాడాలని రైతాంగానికి సూచించారు.

మేళాలో ఏర్పాటు చేసిన క్షేత్ర ప్రదర్శనలను రైతులు ఆసక్తిగా తిలకించారు. కొత్త మొక్కజొన్న వంగడాలతో పంట మార్పిడి లాంటి క్షేత్ర ప్రయోగ ప్రదర్శనలను మహిళా రైతులు ఆసక్తిగా పరిశీలించారు. యూరియా వినియోగం లేకుండా నానో యూరియా ప్రత్యామ్నాయంగా వినియోగించి దిగుబడి తగ్గకుండా వివిధ పంటల సాగుకి సంబందించిన ప్రదర్శనా క్షేత్రాలను సందర్శించి శాస్త్రవేత్తల నుంచి వివరాలు సేకరించారు.

రైతు మేళా ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి, సమాచార కమిషనర్ పివి శ్రీనివాస్, రైతు సంక్షేమ కమిషన్ సభ్యురాలు భవానీరెడ్డి, కోరమాండల్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి తదితరులు అతిధులుగా పాల్గొన్నారు.

# విద్యుత్ 3 వేల మెగావాట్ల అప్పు

## వడ్డీ కింద 5 శాతం మేర అదనపు విద్యుత్

## ఉత్తరప్రదేశ్‌తో ఒప్పందానికి రాష్ట్రం డిస్కంలు

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** ఇప్పటి వరకూ నగదును అప్పుగా తీసుకుంటున్న తెలంగాణ తాజాగా విద్యుత్‌ను కూడా అప్పుగా తీసుకోవాలని తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు కొత్తగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందుకు అయ్యే వడ్డీని కూడా చెల్లించేందుకు ముందుకు వస్తున్నాయి. అంతర్జాతీయంగా ఎక్స్ఛేంజీలో విద్యుత కొనుగోలు చేస్తున్న విద్యుత్ పంపిణీ సంస్థలు ఆ భారాన్ని తగ్గించుకునేందుకు అప్పులు బాట పడుతున్నాయి. ఈ మేరకు దీనికి సంబంధించి ఉత్తరప్రదేశ్ విద్యుత్ సంస్థతో ఒప్పందాలు చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలియవచ్చింది. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం, అందుకు అనుగుణంగా విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో పెరుగుతుండటంతో, అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రాష్ట్ర పంపిణీ సంస్థలకు తప్పడం లేదు. ఈ నేపథ్యంలోనే ఉత్తరప్రదేశ్ నుండి రాష్ట్రానికి దాదాపు 3 వేల మెగావాట్ల విద్యుత్‌ను అప్పుగా తీసుకునేందుకు రాష్ట పంపిణీ సంస్థలు చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయి. 3 వేల మెగావాట్ల విద్యుత్‌ను అప్పుగా తెలంగాణ పంపిణీ సంస్థలకు ఇచ్చేందుకు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ సంస్థ సుముఖత కనపరచినట్లు అధికారవర్గాల ద్వారా వెల్లడైంది. ఏప్రిల్ నుండి జూలై 10వ తేదీ లోపుగా అప్పుగా తీసుకున్న ఈ 3 వేల మెగావాట్ల విద్యుత్‌కు అదనంగా మరో 5 శాతం మేర విద్యుత్‌ను వడ్డీ కింద చెల్లించే ప్రాతిపదికన ఒప్పందాలు చేసుకుంటున్నాయి.

# నాణ్యతలేని మందులపై ప్రభుత్వం కఠినచర్యలు

## డిసిఎ ఆధ్వర్యంలో బల్క్ ఎస్ఎంఎస్

## అలర్ట్ సిస్టం ప్రారంభం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి9:** నాణ్యతలేని మందుల విక్రయాన్ని అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) ఆధ్వర్యంలో బల్క్ ఎస్ఎంఎస్ అలర్ట్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఈ వ్యవస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులకు వెంటనే సమాచారం అందించేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా నాణ్యతలేని, అనుమానాస్పద మందులు గుర్తించిన వెంటనే అన్ని మెడికల్ షాపులకు ఎస్ఎంఎస్ ద్వారా అలర్ట్ పంపిస్తున్నారు. దీంతో ఆ మందుల విక్రయాన్ని వెంటనే నిలిపివేయాలని మెడికల్ షాపులకు సూచనలు అందుతాయి.ప్రజలకు హానికరంగా మారే మందులు మార్కెట్‌లో అమ్మకుండా ముందుగానే అడ్డుకోవడమే ఈ వ్యవస్థ ప్రధాన లక్ష ్యం. నాణ్యతలేని మందులు అమ్మడం వల్ల రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఈ చర్యలను చేపట్టింది. ఈ కొత్త వ్యవస్థకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులను ప్రభుత్వం అనుసంధానం చేస్తోంది. ఒకసారి అలర్ట్ జారీ అయిన వెంటనే ప్రతి ఫార్మసీకి సమాచారం చేరేలా డిజిటల్ సాంకేతికతను ఉపయోగి స్తున్నారు. ఔషధాల నాణ్యత, పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు డిజిటల్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆధునిక వ్యవస్థలను ప్రవేశపెట్టి మందుల నియంత్రణను మరింత కట్టుదిట్టం చేసేలా డీసీఏ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

# పేదలు ఇంటిస్థలం అడిగితే అక్రమ అరెస్టులా?

## కార్పొరేట్లకు వేల ఎకరాల భూములు?

## అరెస్టులను తీవ్రంగా ఖండించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో సీఎం క్యాంప్ ఆఫీస్ పాదయాత్రను పోలీసులు అడ్డుకోవడాన్ని పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తీవ్రంగా విమర్శించారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను, పేదలను అక్రమంగా అరెస్టులు చేసి, ఎల్‌బీ నగర్, అబ్దుల్లాపూర్‌మెంట్, నాగోలు, వనస్థలీపురం పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో వేల ఎకరాల విలువైన భూములను బడా బాబులకు, కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం... సెంట్ భూమి కూడా లేని నిరుపేదలు తలదాచుకోవడానికి ఇండ్ల స్థలాలు అడిగితే వారిపై లాఠీలు ఝులిపించడం దుర్మార్గమ న్నారు. నగర శివార్లకు తరలించిన పరిశ్రమల స్థలాలను, నగరంలోని ప్రభుత్వ స్థలాలను పేదల ఇళ్ల నిర్మాణానికి కేటాయించకుండా, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూడడం అన్యాయమన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న ఈ ప్రభుత్వం పేదల పట్ల కసాయిగా వ్యవహరిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాపితంగా బుల్డోజర్ వ్యవస్థను తెచ్చి, పేదల ఇండ్లు కూల్చుతూ, వారిని నిరాశ్రయులను చేస్తుందని మండిపడ్డారు.

గాంధీ సరోవర్ ప్రజలను కనికరం లేకుండా ఖాళీ చేయించడం, ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో పేదల ఇండ్లు కూల్చడం, మూసీ పరివాహక ప్రాంతంలో వేలాది మందిని నిరాశ్రయులను చేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. ఇటువంటి దుర్మార్గపు చర్యలను తక్షణమే నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. తక్షణమే పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలని, లేనిపక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో జాన్‌వెస్లీ, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, డి రామచందర్, జిల్లా నాయకులు ఎం చంద్రమోహన్, కవిత, ఇ నర్సింహ, జగదీష్, కిషన్ ఉన్నారు.

# భయం లేకుండా ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలి

## మార్కుల గురించి ఎక్కువగా ఆలోచించవద్దు

## ఎస్ఎస్‌సి విద్యార్థులకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా సూచన

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు భయం లేకుండా, ఆత్మస్థైర్యంతో పరీక్షలను రాయాలని విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. పరీక్షలు జీవితంలో ఒక దశ మాత్రమేనని, మార్కుల గురించి ఎక్కువగా ఆలోచించవద్దన్నారు. ఎస్ఎస్‌సి విద్యార్థులకు టి-సాట్ ద్వారా ప్రేరణాత్మక మార్గదర్శక సెషన్‌ను పాఠశాల విద్యా శాఖ సోమవారం నిర్వహించింది. పరీక్షల ఒత్తిడిని తగ్గించడం, విద్యా మార్గదర్శకత్వం అందించడంతోపాటు పరీక్షల చివరి దశ సమయంలో విద్యార్థులు సమర్థవంతంగా సిద్ధం కావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని పాఠశాల విద్య శాఖ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, పాఠశాల విద్య డైరక్టర్ డాక్టర్ ఈ నవీన్ నికోలస్, ఎస్‌సీఈఆర్‌టీ డైరక్టర్ రమేష్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పద్మజా పాల్గొన్నారు. డాక్టర్ యోగితా రాణా మాట్లాడుతూ.. పరీక్షలకు ఆత్మస్థైర్యంతో హాజరు కావాలన్నారు. భయం లేకుండా ప్రశాంతంగా పరీక్షలను రాయాలన్నారు. మార్కుల గురించి ఎక్కువగా ఆలోచించొద్దని, మార్కుల కంటే సాధనపై దృష్టి పెట్టాలన్నారు. పరీక్షలు జీవితంలో ఒక దశ మాత్రమేనని, విద్యార్థులు దీర్ఘకాలిక లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. తల్లిదండ్రులు తమ ఇళ్లల్లో విద్యార్థులు నేర్చుకోవడానికి వాతావరణాన్ని కల్పించాలన్నారు. చదివిన విషయాన్ని వ్రాస్తే ఎక్కువ కాలం గుర్తుంచుకోగలుగుతారని అన్నారు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలకు వచ్చిన సెలవు రోజులను ఉపయోగించుకోవాలని సూచించారు. పాఠశాల విద్య డైరక్టర్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ మాట్లాడుతూ.. ఒక పరీక్షకు మరో పరీక్షకు మధ్య ఉన్న సెలవు రోజులను రివిజన్ చేసుకుంటూ, రైటింగ్ ప్రాక్టీస్ చేస్తూ సందేహాల నివృత్తి చేసుకోవాలని సూచించారు. సబ్జెక్టును రివిజన్ చేయడానికి అభ్యాస దీపికను ఉపయోగించుకోవాలని సూచించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి వివిధ సబ్జెక్టులలోని నిర్దిష్ట అంశాలను రివిజన్ చేసుకోవాలన్నారు. గత సంవత్సరం ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయాలన్నారు.

# గ్రీన్‌ఎనర్జీ ఉత్పత్తిపై సింగరేణి దృష్టి

## కార్మికుల నివాసాలపై సౌర ఫలకాలు

## 15 వేల కిలోవాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యం

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** సింగరేణి సంస్థ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా సింగరేణి ఏరియాల్లోని కార్మికుల నివాస గృహాలపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేసేసేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం అనువైన నివాస గృహాలను గుర్తించేందుకు సింగరేణి అధికారులు సర్వే నిర్వహించారు. ఎక్కడైతే చెట్లు, నీళ్ల ట్యాంకులు లేకుండా ఖాళీగా నివాస గృహాలు ఉన్నాయో వాటిపై ఈ ప్యానళ్లు ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సింగరేణి అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకు గాను సింగరేణి యాజమాన్యం ఓ ప్రైవేటు సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. పదేళ్లపాటు ఈ సంస్థనే కార్మికుల ఇళ్లపై సోలార్ నిర్వహణ బాధ్యత చేపట్టనుంది. ఇక సింగరేణి క్వార్టర్లలో కార్మికుల గృహ విద్యుత్తు వినియోగానికి ప్రస్తుతం నెలకు సుమారుగా రూ.50 నుంచి 60 కోట్ల మేర సంస్థ యాజమాన్యం చెల్లిస్తోంది. దీంతో తాజాగా తీసుకున్న రూఫ్ టాప్ సౌర విద్యుత్తు నిర్ణయంతో సింగరేణికి ఆ భారం చాలా వరకు తగ్గనుంది. అన్ని ఏరియాల వ్యాప్తంగా 15 వేల కిలోవాట్ల మేర సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలని సంస్థ టార్గెట్‌గా పెట్టుకుంది. ఇందు కోసం రూ.65 కోట్ల ఖర్చు చేయనుంది. ఉద్యోగుల గృహాలకు వినియోగించగా మిగిలిన మొత్తాన్ని గ్రిడ్‌కి అనుసంధానించనున్నారు. ఈ మేరకు 800 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తే లక్ష ్యంగా ఇప్పటికే పలు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్ల ద్వారా ప్రస్తుతానికి 500 మెగావాట్ల వరకు లక్ష్యాన్ని సాధించింది. రూఫ్‌టాప్ సౌర విద్యుత్తు పనులు త్వరలో ప్రారంభం అవుతాయని సింగరేణి అధికారవర్గాలు వెల్లడించాయి. సంస్థ ఆర్థిక భారం తగ్గడంతో పాటు, పర్యావరణ పరంగా బొగ్గు ఆధారిత విద్యుత్తుపై ఆధారపడటం తగ్గి, కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని, ఇది గ్రీన్ ఎనర్జీ లక్ష్యానికి దోహదపడుతుందని వెల్లడిస్తున్నారు.

# జుట్టు పెరిగిందని విద్యార్థికి ట్రిమ్మింగ్ చేయించిన ఉపాధ్యాయుడు

## హాఫీజ్‌పేట్ ప్రైవేటు స్కూల్‌లో వివాదం

**హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి), మార్చి 9, ప్రభాతవార్త:** జుట్టు పెంచుకొని స్కూల్‌కు వచ్చిన ఓ విద్యార్థికి ఉపాధ్యాయుడు ట్రిమ్మింగ్ చేయించడం వివాదానికి కారణమైంది. దేవుని మొక్కుగా జుట్టు పెంచామని, ఉపాధ్యాయుడు అత్యుత్సాహం ప్రదర్శించాడంటూ విద్యార్థి సంఘాలతో కలిసి స్కూల్ ముందు తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. దీంతో స్కూల్ యజమాన్యం కల్పించుకొని ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించడంతో వివాదం సద్దుమణిగింది. హాఫీజ్‌పేట్‌లో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. న్యూ హాఫీజ్‌పేట్ ప్రేమ్ నగర్‌లో గల బ్లాక్ బోర్డు ది స్కూల్‌లో ఈశ్వర్ అనే విద్యార్థి 9వ తరగతి చదువుతున్నాడు. ఈశ్వర్ తన జుట్టు ఎక్కువగా పెంచుకొని స్కూల్‌కు వస్తుండడంతో పలుమార్లు మందలించిన ఉపాధ్యా యుడు ఈనెల 7న బాలుడి జుట్టుకు ట్రిమ్మింగ్ చేయించాడు. ఈ విషయం వివా దస్పదంగా మారింది. తమ కుమారుడి జుట్టు దేవుడి మొక్కు ఉందని, తమను సంప్రదించకుండా ఉపాధ్యాయుడు ట్రిమ్మింగ్ చేయించడంపై విద్యార్థి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘాలతో కలిసి పాఠశాల ముందు ఆందోళన చేపట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారిం ది. దీంతో ఈ విషయమై స్కూల్ యజమాన్యం కల్పించుకొని సంఘ టనపై విచారం వ్యక్తం చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతోపాటు ఘటనకు కారణమైన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు స్కూల్ యజమాన్యం ప్రకటించడంతో వివాదం సద్దుమణిగింది. కాగా ఈ విషయమై ఎటువంటి పిర్యాదు అందలేదని మియాపూర్ పోలీసులు తెలిపారు.

